# ప్రభుత్వంపై ప్రజాగ్రహం

## అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకులేవు..

## ఎక్కడికక్కడ అధికారులను నిలదీసిన ప్రజలు

## తొలిరోజు గ్రామసభల్లో గందరగోళం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం మంగళవారం నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా మారాయి. నాలుగురోజులపాటు జరుగనున్న ఈ సభల్లో భద్రాద్రి జిల్లావ్యాప్తంగా తొలిరోజే అధికారులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీశారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. అభ్యంతారాలు ఉంటే తెలియజేయాలని సూచించడంతో అనర్హుల పేర్లు జాబితాలో చేర్చారని అధికారులతో గ్రామస్తులు వాగ్వాదం చేశారు. అర్హత ఉన్నా లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని ప్రశ్నించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని గొడవకు దిగారు. అన్ని గ్రామసభల్లోనూ లబ్ధిదారుల ఎంపిక జాబితాపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది.

**– నమస్తే నెట్‌వర్క్**


ఇల్లెందు రూరల్ : గ్రామసభలో హాజరైన ప్రజలు


దుమ్ముగూడెం : నిరసన వ్యక్తం చేస్తున్న రవికుమార్


జూలూరుపాడు : అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


కొత్తగూడెం అర్బన్ : అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు


చర్ల : సుబ్బంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం


బూర్గంపహాడ్ : మాట్లాడుతున్న తహసీల్దార్


ఇల్లెందు : వార్డు సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు


పాల్వంచ రూరల్ : కేశాపురంలో అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం


పినపాక : అధికారులను నిలదీస్తున్న ప్రజలు


అన్నపురెడ్డిపల్లి : అధికారులతో వాగ్వాదం


అశ్వారావుపేట : మాట్లాడుతున్న తహసీల్దార్


అశ్వారావుపేట టౌన్ : లిస్టులో పేరులేదంటున్న గుర్రాలచెరువు వృద్ధులు


దమ్మపేట : అధికారులను నిలదీస్తున్న అధికార పార్టీ ప్రతినిధులు


వార్డు సభలకు హాజరైన ప్రజలు


ఆళ్లపల్లి : మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీను


కరకగూడెం: మాట్లాడుతున్న ఎంపీడీవో


పాల్వంచ : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


లక్ష్మీదేవిపల్లి మండలంలో గ్రామసభ


ఇల్లెందు రూరల్ : గ్రామసభలో హాజరైన ప్రజలు

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

ఇల్లెందు రూరల్, జనవరి 21 : డీఎస్సీ, ఎస్సై, పోలీస్, ఇతర గ్రూపులకు సంబంధించి పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుదిమళ్లలోని యూఆర్‌జేసీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేకే కాలనీలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఈ నెల 22న గ్రంథాలయం ప్రారంభిస్తున్నామన్నారు. 26వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో నాగార్జున్ రావు, ఏటీడీవో రాధమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, ఏఈ సాలార్, రాజు,ప్రిన్సిపాల్ మాధవి, రత్నకుమారి పాల్గొన్నారు.

## పోతినేనిని పరామర్శించిన తాటి


పోతినేని వెంకట్రావును పరామర్శిస్తున్న తాటి వెంకటేశ్వర్లు

దమ్మపేట, జనవరి 21 : మండల కేంద్రమైన దమ్మపేటలోని పోతినేని వెంకట్రావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మొరహరి రాంబాబు, పానుగంటి రాంబాబు, గాజుబోయిన ఏసుబాబు, దొడ్డా రమేష్, స్థానిక నాయకులు ఉన్నారు.

## మోడల్ సోలార్ విలేజ్‌గా గండుగులపల్లి

దమ్మపేట రూరల్, జనవరి 21: జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్‌గా మండల పరిధిలో గండుగులపల్లిని ప్రభుత్వం ఎంపిక చేసింది. గండుగులపల్లి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణల స్వగ్రామం. మోడల్ సోలార్ విలేజ్ లక్ష్యాలపై మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విద్యుత్‌శాఖ ఎస్ఈ మహేంద్రతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈ నందయ్య, ఏడీ వెంకటరత్నం, డీఎం అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌లోని కర్రలు పడి డ్రైవర్‌కు గాయాలు

సత్తుపల్లిటౌన్, జనవరి 21: జామాయిల్ కర్రల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌లోని కర్రలు డ్రైవర్‌పై జారి పడడంతో తీవ్ర గాయాలైన ఘటన సత్తుపల్లి మండలం జగన్నాథపురంలో మంగళవారం చోటు చేసుకుంది. ఒరిస్సాకు చెందిన జానివస్తు రాజు జగన్నాథమపురంలో జామాయిల్ కర్రలను ట్రాక్టర్‌లో వేంసూరు మండలం వెంకటాపురానికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ పొలం గట్టుపైకి ఎక్కడంతో ట్రాక్టర్‌లోని జామాయిల్ కర్రలు జారిపడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తోటి కూలీలు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : కలెక్టర్


మద్దుకూరు గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

చంద్రుగొండ, జనవరి 21 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందాలనే ఉద్దేశంతోనే లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టినట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. మంగళవారం మద్దుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్ కార్డుల పథకాల జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, జాబితాలో పేర్లు రానివారు వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులు ఎంతమంది ఉన్నా వారిపేర్లు చేర్చడానికి ఎటువంటి అభ్యంతరంలేదన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. గ్రామ సభలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి విద్యాచందన, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణకుమారి, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

### గణతంత్రదిన వేడుకలకు ఏర్పాట్లు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ ప్రగతి మైదానంలో స్టేజీ ఏర్పాట్లతోపాటు విద్యాశాఖ ద్వారా కల్చరల్ ప్రోగ్రామ్స్, నిరంతర విద్యుత్, తాగునీరు, సౌండ్ ప్రూఫ్ జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని, బారికేడింగ్ పటిష్టంగా చేపట్టాలని, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్స్ వద్ద వచ్చే అతిథులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రుణాల చెల్లింపులు జరిగేలా చూడండి

చంద్రుగొండ, జనవరి 21: మండలంలోని ఎస్‌హెచ్‌జీ(స్వయం సహాయక సంఘాలు) గ్రూపు రుణాల చెల్లింపులు సక్రమంగా జరిగేలా చూడాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఏ.వెంకట రవికుమార్ బ్యాంకు మిత్రలు, సీసీలు, గ్రామదీపికలకు సూచించారు. మంగళవారం బ్యాంకులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రుణాల చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. లేకుంటే వారికి వచ్చే వడ్డీ రాయితీలు రావన్నారు. సమావేశంలో పీల్డ్ ఆఫీషర్స్ యాదగిరి, శ్రీలక్ష్మి, సీసీలు, గ్రామదీపికలు, బ్యాంకుమిత్రలు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు : డీఎస్పీ

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 21: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దని, మీ లక్ష్యం కోసం పాటుపడుతూ చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం ప్రియదర్శిని డిగ్రీ కాలేజీలో గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం టీఎస్ఎన్ఏబీ డీఎస్పీ మధుమోహన్‌రెడ్డితో కలిసి అవగాహన కల్పించారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 21: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## నీటి సంపులో పడి వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్, జనవరి 21: కూలి పనికి సంపులో నీటిని తోడుతూ ప్రమాదవశాత్తు పడిపోయిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని ద్వారకాపురం కాలనీలోని డేవిడ్ డానియల్ నివాసంలోని నీటి సంపును శుభ్రం చేసేందుకు కూలి పనికి పెనుబల్లి మండలం టేకులపల్లికు చెందిన గోళ్లమందల పుల్లారావు(42) వచ్చాడు. నీటిని తోడుతుండగా ఫిట్స్ రావడంతో సంపులో పడి పోయడు. చాలాసేపటి తర్వాత అతన్ని గమనించి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పుల్లారావుకు భార్య రాణి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## నేటి నుంచి జిల్లాస్థాయి క్రీడలు

రామవరం, జనవరి 21 : గవర్నమెంట్ పాలిటెక్నిక్ కొత్తగూడెంలో జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు, ఆటలను ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను, జట్టు భావనను ప్రదర్శించనున్నారన్నారు. 22వ తేదీ ఉదయం 9:30 గంటలకు జ్యోతిప్రజ్వలన చేసి ముఖ్యఅతిథులుగా ఈ క్రీడా పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు. చివరిరోజు విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని వివరించారు.

## చందాలు వసూలు చేయవద్దు

కొత్తగూడెం సింగరేణి, జనవరి 21 : సింగరేణి కార్మికుల అనుమతులు లేకుండా యూనియన్‌లు చందాలు వసూలు చేయకూడదని, యాజమాన్యం కార్మికుల పేమెంట్ రికవరీ చేయడం సరైన పద్ధతి కాదని టీబీజీకేఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ అన్నారు. సోమవారం రాత్రి కొత్తగూడెం కార్పోరేట్ టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

## మద్యం దోపిడీపై ఎమ్మెల్యేకు వినతి

ఇల్లెందు, జనవరి 21 : ఇల్లెందు పట్టణంలో మద్యం వ్యాపారులు చేస్తున్న అక్రమ, ఆర్థిక దోపిడీని అరికట్టాలని కోరుతూ మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకులు పడిదల నవీన్ ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందించారు.

## రేపు హిందూముస్లిం ఐక్యత సభ

ఇల్లెందు, జనవరి 21 : ఇల్లెందు పట్టణంలోని గోవింద్ సెంటర్ పెన్షనర్ల భవన్‌లో ఈ నెల 23వ తేదీన జరుగే హిందూముస్లిం ఐక్యత జిల్లా సభను విజయవంతం చేయాలని జైభారత్ బీసీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలిమిశెట్టి వీరన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరానగర్‌లోని మసీదు వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## భద్రాచలం సీఐగా రమేష్

భద్రాచలం, జనవరి 21: భద్రాచలం సీఐగా బరపటి రమేష్ మంగళవారం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సంజీవరావు వరంగల్ ఐజీ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వరంగల్ ఐజీ కార్యాలయం నుంచి సీఐగా రమేష్ బాధ్యతలు చేపట్టారు.

## కొనసాగిన ఆర్టీజన్ల నిరాహార దీక్ష

పాల్వంచ, జనవరి 21 : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టీజన్ల సమస్యల పరిష్కారం కోరుతూ కేటీపీఎస్ ప్రాంగణంలో మంగళవారం రెండోరోజు కూడా ఆందోళన కార్యక్రమం కొనసాగింది. టీఎస్‌పీఈఏ తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ కేటీపీఎస్ బ్రాంచి సెక్రటరీ ఇంజినీర్ ఉమామహేశ్వరరావుతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

## నేత్ర వైద్యశిబిరం విజయవంతం

అశ్వాపురం, జనవరి 21: మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపక ఉపాధ్యాయుడు స్వర్గీయ తిప్పారెడ్డి నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మణుగూరు నేత్రాలయ ఐకేర్ అండ్ అప్టికల్స్, శ్రీరామచంద్రమిషన్ సహకారంతో మంగళవారం పాఠశాలలో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

## వెంకటేశ్వర్లు మృతికి నివాళి

భద్రాచలం, జనవరి 21: భద్రాచలం పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రాటాల వెంకటేశ్వర్లు మృతికి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు.

## ఆర్థిక సాయం

రామవరం, జనవరి 21 : కొత్తగూడెం మండలంలోని రామవరం టూ ఇంక్లైన్ ఏరియాకు చెందిన బాలిక సారియా ప్రమాదశాత్తు వేడినీటిలో పడి తీవ్రంగా గాయపడింది. చిన్నారికి వైద్య ఖర్చుల కోసం రుద్రంపూర్ జేఏహెచ్ సభ్యులు రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు.

## కారుణ్య నియామకాలకు ముఖాముఖి

ఇల్లెందు రూరల్, జనవరి 21: కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న సింగరేణి ఉద్యోగుల వారసులతో సింగరేణి అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో జేకే 5 ఉపరితల గని నుంచి కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసుడికి కుటుంబసభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూ నిర్వహించి వివరాలను నమోదు చేశామని అధికారులు తెలిపారు. వైద్యపరీక్షలకు పంపించి నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

## హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

పాల్వంచ, జనవరి 21: కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో మంగళవారం టీజీ జెన్కో రాష్ట్రస్థాయి ఇంటర్ ప్రాజెక్టు హాకీ, బాస్కెట్ బాల్ పోటీలను ఏటీపీఎస్ 5, 6, 7 దశలు, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సీఈలు ప్రభాకర్ రావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ ప్రారంభించారు. కేటీపీఎస్ 5,6 దశల హైడెల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పోటీలు మూడ్రోజులపాటు జరగనున్నాయి. క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేస్తున్నట్లు సీఈ ప్రభాకర్‌రావు తెలిపారు.

## కేటీపీఎస్ ఆర్టీజన్ ఆత్మహత్య

పాల్వంచ, జనవరి 21 : కుటుంబ కలహాల నేపథ్యంలో కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలోని బాయిలర్ మెయింటినెన్స్‌లో ఆర్టీజన్‌గా పనిచేస్తున్న పులికంటి మనోహర్(37) మంగళవారం రైల్వేట్రాక్‌పై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తగూడెం జీఆర్‌పీఎస్ఐ(డోర్నకల్) జి.సురేష్ తెలిపిన వివరాలు... మృతుడు పాల్వంచ మండలంలోని పునుకుల గ్రామంలో నివసిస్తూ పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారంలో ఆర్టీజన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటిలో భార్యతో గొడవపడి ద్విచక్రవాహనంపై పాల్వంచకు బయల్దేరాడు. మార్గమధ్యంలో కరకవాగు వద్దకు రాగానే కొత్తగూడెం నుంచి మణుగూరుకు రైలు వెళ్తోంది. ఇంట్లో జరిగిన గొడవకు మనస్థాపానికి గురైన మనోహర్ క్షణికావేశంలో వెంటనే రైల్వేట్రాక్‌పై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

భద్రాచలం, జనవరి 21: రహదారి భద్రత.. ప్రతిఒక్కరి బాధ్యత అని భద్రాచలం ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. మంగళవారం కూనవరం రోడ్డులో వాహనదారులతో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ఖచ్చితంగా పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

దుమ్ముగూడెం, జనవరి 21: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కో-కన్వీనర్ ఎండీ.జానీపాషాతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 వాగ్ధానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు.

## ఆటో మోటర్ జిల్లా కమిటీ ఎన్నిక

టేకులపల్లి, జనవరి 21: ఆటో మోటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. మంగళవారం మండలంలో జరిగిన జిల్లా మహాసభ సమావేశంలో టీయూసీఐ అనుబంధ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి తెలిపారు. 17మందితో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

## క్షయ వ్యాధిపై అవగాహన

టేకులపల్లి, జనవరి 21 : మండలం బద్దుతండా ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ప్రజలకు సులానగర్ పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు.

## ఫొటోగ్రాఫర్ కుటుంటానికి ఆర్థికసాయం

ఇల్లెందు, జనవరి 21 : కుటుంబ భరోసా పథకం ద్వారా ఫొటోగ్రాఫర్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్ ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలో రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.లక్ష 60 వేల చెక్కును అందజేశారు.

## భద్రతా నిబంధనలు పాటించాలి

అశ్వారావుపేట, జనవరి 21: ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ కరుణాకర్ వాహనదారులకు సూచించారు. అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు.